ఎడతెరిపిలేని వాన

- నిండిన వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు
- ఎల్లంపల్లి, కుమ్రం భీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఓపెన్
- దిగువ, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

అల్పపీడన ప్రభావంతో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్నది. దీంతో వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. లోతట్లు ప్రాంతాల్లోకి వర్షపు నీరుచేరింది. రోడ్లపై నుంచి వరద పారుతున్నది. ఆయా ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో, దిగువ, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ప్రాజెక్టులు, నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు.

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 1 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం వర్షం కురిసింది. మధ్యలో కాస్త తెరిపి ఇచ్చింది. మధ్యాహ్నం నుంచి రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసింది.

కోటపల్లి, సెప్టెంబర్ 1 : కోటపల్లి మండలంలో శనివారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. నక్కలపల్లి గ్రామానికి వెళ్లేదారిలో లోతెర్రె ఉప్పొంగింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాజేందర్ సూచించారు.

భీమారం, సెప్టెంబర్ 1 : భీమారం మండలంలోని గొల్లవాగు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ఉధృతి పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకదాటిగ వర్షం కురువడంతో ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

వేమనపల్లి, సెప్టెంబర్ 1 : వేమనపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. రైతులు ఉదయం చేలకు వెళ్లగా, వర్షం పడడంతో ఇండ్లకు తిరిగివచ్చారు. ప్రజలు కూడా ఇండ్లకే పరిమితమయ్యారు. నాగారం నుంచి మంగెనపల్లి మట్టి రోడ్డు, చామనపల్లి, బమ్మె, బద్దంపల్లి గ్రామాల్లో మట్టి రోడ్లు బురదమయంగా మారాయి

తాండూర్, సెప్టెంబర్ 1 : తాండూర్ మండలంలో భారీ వర్షం కురిసింది. రోడ్లు, పలు కాలనీల్లో నీరు చేరింది. బోయపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ పరిస్థితి అధ్వన్నంగా తయారైంది. డ్రైనేజీ నిర్మించకపోవడంతో నాలాలు పూర్తిగా నిండి, నీరు రోడ్డుమీదకు వచ్చింది. తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కిరణ్ కుమార్ సూచించారు. గోపాల్ నగర్ మూలమలుపు వద్ద రేచిని సమీపంతో పాటు, శివారులో గల ఇందిరమ్మ కాలనీ కల్వర్టుల బ్రిడ్జి వద్ద వరద ప్రవాహం ఉంటే జాగ్రత్తగా వెళ్లాలన్నారు. రైల్వే స్టేషన్ వైపు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని ఐబీ కేంద్రంతో పాటు, పెట్రోల్ బంక్ సమీపంలో గల అండర్ బ్రిడ్జి సమీపంలో వర్షాలకు వరద నీరు చేరుతుండడంతో గమనిస్తూ వెళ్లాలన్నారు.

బెల్లంపల్లి, సెప్టెంబర్ 1 : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 2వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఇంటి పరిసరాల్లోకి వరద చేరింది. హన్మాన్ బస్తీ, రాంనగర్ బస్తీతో పాటు, పలు బస్తీల్లో వర్షపు ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

పట్టణంలోని రడగంబాల బస్తీ రాతి చెరువు వరద నీరు రైల్వే కాలనీ, ప్రైవేట్ ఇళ్లలోనికి వచ్చి చేరింది. ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో వరద నాలుగు రైల్వే క్వార్టర్లను చుట్టుముట్టింది. బాధితులను మున్సిపల్ సిబ్బంది సింగరేణి కళావేదికలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. వరద నీటిని జేసీబీతో తొలగించేందుకు ప్రయత్నించగా చెడిపోయింది. దీంతో అప్పటికప్పుడు ప్రైవేట్ జేసీబీని తెప్పించి, తొలగింపు ప్రక్రియ ముమ్మరం చేశారు. ఏ సమస్య ఉన్నా ప్రజలు మున్సిపల్ అధికారులను సంప్రదించాలని చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు.

కాసిపేట, సెప్టెంబర్ 1 : కాసిపేట మండలం సోమగూడెం చొప్పరిపల్లిలో వరద నీరు ఇళ్లలో చేరింది. డ్రైనేజీలో నుంచి కాకుండా వరద నీరు ఇళ్లలోకి చేరవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాయకపుగూడ, తిరుమలాపూర్ గ్రామాలకు మధ్యలో వాగులు ఉండడంతో వరద కారణంగా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

చెన్నూర్, సెప్టెంబర్ 1 : చెన్నూర్ పట్టణంలోని పద్మశాలీ కాలనీలోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. కుమ్మరి కుంట, పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్లకు వరద చేరింది. మున్సిపాల్ సిబ్బంది హెల్ప్‌డెస్క్, రెస్క్యూటీంలను ఏర్పాటు చేశారు.

విద్యుత్‌షాక్‌లో రెండు ఎడ్లు మృతి

కన్నెపల్లి, సెప్టెంబర్ 1 : మెట్‌పల్లి గ్రామంలో గద్దల స్వామికి చెందిన రెండు ఎడ్లపై విద్యుత్ తీగలు తెగిపడి మృతిచెందాయి. గాలితోపాటు కురిసిన వర్షానికి విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడ్డాయి. తీగలు తెగి ఎడ్లపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు స్వామి వేడుకున్నాడు.

రెబ్బెన, సెప్టెంబర్ 1 : రెబ్బెన మండలంలో వర్షానికి ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులుపడ్డారు. పలు చోట్ల చిన్న చిన్న వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులలోకి నీరు వచ్చి చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కెరమెరి, సెప్టెంబర్ 1 : కెరమెరి మండలంలో శనివారం కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు మండలంలోని గ్రామాలు చీకట్లో గడపాల్సి వచ్చింది. విద్యుత్ స్తంభాల ఇన్సులేటర్లు పగిలిపోవడంతో ఆసిఫాబాద్ నుంచి వచ్చే 33/11 కేవీ ప్రధాన లైన్‌కు అంతరాయం ఏర్పడిందని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. రాత్రి నుంచి ఆదివారం దినమంత కష్టపడి మరమత్తులు చేయడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 1 : మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మాన్సూన్ ఎమర్జెన్సీ కంట్రోల్ యూనిట్‌ను ఏర్పాటుచేసినట్లు కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు. కంట్రోల్‌రూమ్ 98490 44106, శానిటరీ ఇన్‌స్పెక్టర్ 63023 31510, మున్సిపల్ కమిషనర్ 98499 05886 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కమిషనర్ తెలిపారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 గేట్లు ఓపెన్..

హాజీపూర్, సెప్టెంబర్ 1 : హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద భారీగా వస్తున్నది. దీంతో అధికారులు శనివారం రాత్రి నుంచి 20 గేట్లను ఎత్తి, నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.29 మీటర్లుగా నమోదైంది. సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను 18.2027 టీఎంసీలకు చేరుకున్నది. కడెం ప్రాజెక్టు నుంచి 78,100 క్యూసెక్కులు, ఎగువన కురుస్తున్న వర్షాలకు 51,353 క్యూసెక్కుల నీరు వస్తున్నది. ఈ మేరకు అధికారులు 20 గేట్లను ఎత్తి 144714 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ఇక్కడి నుంచి హైదరాబాద్ ప్రజల తాగునీటి కోసం 304 క్యూ సెక్కులు, నంది పంప్ హౌజ్ నుంచి 9,450 క్యూ సెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పరిస్థితిని తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. ప్రాజెక్టు ఏఈలతో కలిసి ప్రాజెక్టు పరిస్థితిని తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి మధుసూదన్, ఎస్ఐ గోపతి సురేశ్ పరిశీలించారు.

మంచిర్యాల డీసీపీ ప్రాజెక్టు పరిశీలన..

ప్రాజెక్టును మంచిర్యాల డీసీపీ భాస్కర్ పరిశీలించారు. దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలన్నారు. చెరువులు, వాగులు నిండాయని, ఈ నేపథ్యంలో నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, రోడ్ల వద్ద రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. ఆయన వెంట హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్, సిబ్బంది ఉన్నారు.

నిండుగా గోదావరి..

మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 1 : మంచిర్యాల వద్ద గోదావరి నిండుగా ప్రవహిస్తున్నది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేటుల ఎత్తడంతో నిండుకుడలా మారింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని వదిలే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మరోవైపు వర్షంతో జనజీవనం అతలాకుతలమైంది.

కుమ్రం భీం, వట్టివాగు గేట్లు ఓపెన్..

ఆసిఫాబాద్ టౌన్, సెప్టెంబర్ 1 : కుమ్రం భీం ప్రాజెక్టు మూడు గేట్లు, వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి, అధికారులు దిగువకు నీటిని వదులుతున్నారు. కుమ్రం భీం ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 243.0మీటర్లు(10.393 టీఎంసలు) కాగా, ప్రస్తుతం 237.700 (5.809 టీఎంసీలు)కు చేరింది. 3,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అదే మొత్తంలో దిగువకు వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 241 మీటర్లు(2.89 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 238.1 మీటర్లు(2.329 టీఎంసీలు)కు చేరింది. 480 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

భీమారంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గోదావరి పరీవాహక ప్రాంతాల పర్యటన..

దండేపల్లి, సెప్టెంబర్ 1 : కడెం ప్రాజెక్టు 10 గేట్లను అధికారులు ఎత్తారు. నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్ఐ ఉదయ్‌కిరన్ పరీవాహక గ్రామాల్లో పర్యటించారు. గ్రామస్థాయి అధికారులు, ప్రజలను అప్రమత్తం చేవారు. గూడెం వద్ద రోడ్డు తెగిపోవడంతో మరమ్మతులు చేయించారు. వారివెంట నాయకులు గడ్డం త్రిమూర్తి, ముత్యాల శ్రీనివాస్, ముత్తె రాజన్న, కొంగల నవీన్, సిరికొండ నవీన్ తదితరులున్నారు.

పాత ఇళ్ల పరిశీలన..

మందమర్రి, సెప్టెంబర్ 1 : ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గల పాత ఇళ్లను పోలీసు అధికారులతో కలిసి కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. 23వ వార్డు బురదగూడెంలో శిథిలావస్థలో ఉన్న రెండు ఇళ్లను గుర్తించి, నివాసముంటున్న పేగు రాములు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ఖాళీ చేయించారు. కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వర్షాల వల్ల ఏ ఇబ్బంది తలెత్తినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 18004253611, ల్యాండ్ లైన్ 08736-293 611 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వార్డుల్లో సంభవించే విపత్తులను పరిశీలించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, టీపీవో రవీందర్, ఏఎస్ఐ మజీద్, హోంగార్డు దాసరి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, సెప్టెంబర్ 1 : వాంకిడి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీలాదర్ రియాజ్ అలీ సూచించారు. వాగులు, వంకలు, చెరువులకు దూరంగా ఉండాలని తెలిపారు.

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 1 : మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఇస్లాతవన్ నరేశ్ సూచించారు. ప్రాణహిత పరీవాహక దిందా, గూడెం, శివపెల్లి, కోయపల్లి, డబ్బా, దరంపెల్లి, బాబాసాగర్, ఇతర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

తాండూర్ : రేచిని శివారు రోడ్‌డ్యాం పరిశీలిస్తున్న ఎస్ఐ

కన్నెపల్లి : విద్యుదాఘాతంతో మృతిచెందిన ఎడ్లు

హాజీపూర్ : ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

లక్షెట్టిపేట : గోదావరిని పరిశీలిస్తున్న అధికారులు

మందమర్రి : బురదగూడెంలో రాములుకు అవగాహన

జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ ఎన్నిక

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1 : మంచిర్యాల జిల్లా అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ కమిటీ ప్యానల్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో విశ్వకర్మీయ కాటేజ్ ఇండస్ట్రీస్ అండ్ కార్పెంటర్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి రాజేందర్ చార్యులు, ప్రధాన కార్యదర్శిగా కడివెండి రవి చార్యులు, కార్య నిర్వహణ అధ్యక్షులుగా సీలోజు నరసింహ చార్యులు, కోశాధికారిగా పూసల చందుచారి, ముఖ్య సలహాదారుడిగా తాటికొండ రాజకుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, మహేశ్, రమేశ్, సహాయ కార్యదర్శులుగా ప్రవీణ్, నరేందర్, గోపాల్ చారి, ప్రచార కార్యదర్శిగా వేల్పూర్ సంతోష్ ఎన్నికయ్యారు. ఏబీవీపీ ప్రధాన కార్యదర్శి అనిపెద్ది వేణుగోపాల చారి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చింతల రాజేశ్వర్ చారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమారం, సెప్టెంబర్ 1 : మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగుడిసెల కాలనీకి చెందిన పిట్టల పద్మ, భీమారం మండల కేంద్రానికి చెందిన కుమార్‌కు గాయాలయ్యాయి. పద్మ మండల కేంద్రంలో జరిగిన వారసంతకు వెళ్లి, ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో కుమార్ వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు దవాఖానకు తరలించారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. రహదారిపై విద్యుత్ దీపాలు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1 : దొంగతనం కేసులో కన్నెపల్లి మండలానికి చెందిన మోర్ల అరుణ్, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి గుగులోత్ నెహ్రూ, మంచిర్యాల పట్టణంలోని తిలకనగర్‌కు చెందిన గొత్రే పవన్‌ను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. గోపాలవాడకు చెందిన వొడ్నాల నరేశ్‌కు చెందిన కిరణాషాపులో శనివారం రాత్రి దొంగతనానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ ప్రాంతంలో సిగరెట్ ప్యాకెట్ డబ్బాలు విక్రయించేందుకు రాగా, వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2,500, రూ.10వేల విలువ గల సిగరెట్ ప్యాకెట్ డబ్బాలను స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రిమాండ్ నిమిత్తం జైలుకు పంపినట్లు వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట, సెప్టెంబర్ 1 : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు ముట్టుకోవద్దని సూచించారు. తీగలకు తగిలే చెట్లను ముట్టుకోవద్దని, విద్యుత్ లైన్ కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న 17 మందిపై కేసు

వేమనపల్లి, సెప్టెంబర్ 1 : వేమనపల్లి మండల కేంద్రంలోని బెస్తవాడలో కోడి పందాలు ఆడుతున్న 17 మందిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడిచేయగా, గుమ్ముల పోశం, చింతల శంకర్ పట్టుబడినట్లు పేర్కొన్నారు. మిగతా వారు పారిపోయారని, వీరిని విచారించగా వారి వివరాలు తెలిపారన్నారు. పారిపోయిన వారిలో పల్లికొండ దీపక్, కంపెల శంకర్, గుమ్ముల రాజేశ్, జెల్ల శేఖర్, ఎల్లెల శ్రీను, మంచెర్ల హన్మంతు, బోరె రాజం, భక్తు బాపు, తొర్రెం తిరుపతి, గుమ్ముల గంగయ్య, ఎల్లెల శేఖర్‌తో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు వెల్లడించారు. వీరి నుంచి 3 కోడి పుంజులు, 3 కత్తులు, రూ.600 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE AT SIRPUR
O.S. No. 103 OF 2024
BETWEEN:
IBRAHIM KHAN AND OTHERS ...Plaintiffs
AND
THE TAHSILDAR AND OTHERS ...Defendants
To
All Concerned
Take notice that the above O.S is filed by the plaintiffs for declare the status of the plaintiffs as legal heirs of Late Fazal Khan & Sarwar Khan, against the defendants and the case is posted to **24-09-2024** for appearance of any person having any claim or say in the above matter, fail to appear in the above said court on the above said day at 10-30 AM, in person or through Advocate, then the case will be decided as per law.
"BY ORDER OF THE COURT"
Sd/- **G.GANARATHI,** Advocate
C-42/B, Sirsilk Colony, Sirpur-Kaghaznagar
(Counsel of Plaintiffs) Cell: 9441736527

ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు మరో కుటుంబం బలి

- భార్య, పిల్లలకు విషమిచ్చి చంపి.. ఆపై ఉరి వేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- మంచిర్యాలలో విషాదం.. నేడు అంత్యక్రియలు

భార్య, పిల్లలతో వెంకటేశ్ (ఫైల్)

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1 : ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌ల మోసానికి మరో కుటుంబం బలైపోయింది. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఈజీగా డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశంతో అప్పులు చేసి ఆన్‌లైన్‌లో పెట్టి నష్టపోయాడు. అవి తీర్చలేక తన భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి ఆపై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంచిర్యాలలో తీవ్ర విషాదాన్ని నింపింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీకి చెందిన ఇప్ప కొమురయ్య(రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి-రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్దకొడుకు జీవన్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ కుటుంబంతో సహా అక్కడే స్థిరపడ్డాడు. కూతురు-అల్లుడు హాజీపూర్ మండలం గుడిపేటలో నివాసముంటూ పాల వ్యాపారం చేసుకుంటున్నారు. రెండో కొడుకు వెంకటేశ్ (40) కుటుంబంతో సహా హైదరాబాద్‌లోని జీడిమెట్ల గాజుల రామవరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. దాదాపు రూ.20 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. దీనికితోడు కొన్ని ఆన్‌లైన్ యాప్‌లలో లోన్లు కూడా తీసుకున్నాడు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు తలెత్తడంతో ఓ నిర్ణయానికి వచ్చాడు. తాను ఒక్కడే ఆత్మహత్య చేసుకుంటే.. భార్యా పిల్లలు రోడ్డున పడుతారని భావించాడు. ముందుగా తన భార్య వర్షిణి(33), పిల్లలు రిషికాంత్ (11), విహంత్(3) విషం ఇచ్చాడు. వారు చనిపోయాక తన భార్య చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు తమ మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని ఓ సెల్ఫీ వీడియో తీశాడు. ఈ విషయాన్ని తన తండ్రి కొమురయ్యకు కూడా ఫోన్ చేసి చెప్పినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అక్కడి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా నేడు మంచిర్యాలలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పనులకు శంఖుస్థాపన చేస్తాం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 1 : మంచిర్యాల నియోజకవర్గంలో ఈ నెలాఖరులోగా అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు చేస్తామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వెల్లడించారు. ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఐబీ స్థలంలో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మించనున్నట్లు, శంఖుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ జాతీయ నేతలు హాజరవుతారన్నారు. రాళ్లవాగు వరద ముంపు రాకుండా కరకట్ట కట్టనున్నట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు శంఖుస్థాపన, ముల్కల్ల నుంచి బసంత్‌నగర్ వరకు గోదావరిపై రూ.375 కోట్లతో బ్రిడ్జి నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మంచిర్యాల మున్సిపల్ పరిధిలో 163 మంది లబ్ధిదారులకు స్థానికి షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ఇతర నేతలు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో..

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 1 : లక్షెట్టిపేట పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాలులో 194 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన అభివృద్ధి సంక్షేమ శాఖ చైర్మన్ కోట్నాక తిరుపతి, మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం, ఎంపీడీవో సరోజ, మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, కౌన్సిలర్లు చింత సువర్ణ, రాందేని వెంకటేశ్, సురేశ్‌నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, నాయకులు పూర్ణచందర్‌రావు, చింత అశోక్, గడ్డం త్రిమూర్తి, అంకతి శ్రీనివాస్, రాందేని చిన్న వెంకటేశ్, గోప రమేశ్, బానాల రమేశ్, అమీర్, రాజు, చంద్రమౌళి, సందెల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు నవాబ్ ఖాన్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే మండలంలోని హన్మంతపల్లి గ్రామానికి చెందిన ఆది భూమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 1 : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగ ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్మికుల వేతనాలు పెంచాలని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, కార్మికులకు ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీలతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన వర్కర్స్ మండల కమిటీ ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షురాలు ఎర్ర కాంత, సభ్యులు రమాదేవి, బుజ్జమ్మ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు

నస్పూర్, సెప్టెంబర్ 1 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ చేయాలనుకునే వారు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో గానీ, 7780708354 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, సెప్టెంబర్ 1 : మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టుల కోసం దరఖాస్